## క్లుప్తంగా

### ఆధార్ సేవల కోసం జనాల పాట్లు



ఆధార్ అప్‌డేట్ కోసం హెడ్ పోస్టాఫీసు వద్ద బారులు తీరిన జనం

సామర్లకోట: కీలకంగా మారిన ఆధార్ అప్‌డేట్ కోసం స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద జనం బారులు తీరారు. ఆధార్ కార్డు పొంది, పదేళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలనే ఆదేశాల మేరకు విద్యార్థులు, మహిళలు, వృద్ధులు మంగళవారం పోస్టాఫీసుకు తరలివచ్చారు. సచివాలయాలు, మీ–సేవా కేంద్రాల ద్వారా ఆధార్ అప్‌డేట్ ప్రక్రియలు జరుగుతాయని అధికారులు చెప్పినా, అక్కడ అవి పని చేయకపోవడంతో హెడ్ పోస్టాఫీసు వద్ద జనం పడిగాపులు పడ్డారు. ఆధార్ అప్‌డేట్ కాకపోతే ప్రభుత్వ పథకాలు అందవనే ఉద్దేశంతో, ఎవరికి వారే పోస్టాఫీసుకు తరలిరావడంతో పొడవైన క్యూలు ఏర్పడ్డాయి. పెద్ద సంఖ్యలో జనం రోడ్డుపైకి చేరినా పోలీసులు అక్కడ కనిపించలేదు. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

### రైతుల కోసమే రీ సర్వే సభలు

సామర్లకోట: రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కొప్పుర్తి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని గొంచాల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతుల డాక్యుమెంట్లలో, స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు అయితే రీ సర్వేలో మార్పు చేసుకోవచ్చని చెప్పారు. భూముల వాస్తవ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించాలని కోరారు. అవసరమైన సమయంలో నోటీసులిచ్చి రైతులకు న్యాయం చేస్తారని తెలిపారు. వివిధ సమస్యలపై రైతుల నుంచి 35 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి. సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు టి సాయిరాం, ఎ సంజీవ్, డి దినేష్, సృజన, రాజామణి, మోషేరాజు, వీఆర్వోలు టి సుబ్బారావు, ఎం పద్మనాభం, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

### రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు

కొత్తపల్లి: రైతులు పండించిన ధాన్యాన్ని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారానే కొనుగోలు చేస్తారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోర్సలో ఉన్న రైతు సేవా కేంద్రంలో మంగళవారం వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఠాపురం ఏడీఏ పి.స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

### వృద్ధ దంపతుల కుల బహిష్కరణ!

కొత్తపల్లి: గౌరీదేవి ఉత్సవాలకు చందా ఇవ్వలేదన్న కారణంగా వృద్ధ దంపతులను కుల బహిష్కరణ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మూలపేటలో ఏటా గౌరీదేవి ఉత్సవాలను నిర్వహిస్తారు. దీనికోసం చందాలను సేకరిస్తారు. చేనేత జాంధానీ చీరల వ్యాపారం చేసే రాజపంతుల బాబూరావు కూడా గతంలో విరాళం అందించేవారు. మూడేళ్లుగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి చందా ఇవ్వలేదు. దీంతో స్థానిక కులపెద్దలు తమను విస్మరించారని, దీంతో తీవ్ర మనస్తాపంతో ఇంటికే పరిమితమైనట్లు ఆ దంపతులు పేర్కొన్నారు. అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. దీనిపై నిర్వాహకులను వివరాణ కోరగా, గౌరీ దేవి ఉత్సవాలు కుల పెద్దల నిర్ణయం ప్రకారం జరుగుతాయి. ఆ దంపతులు ఆర్థిక ఇబ్బందుల వల్ల మూడేళ్లగా ఎటువంటి చందా ఇవ్వలేదు. దీనికి వారు తమను కుల బహిష్కరణ చేశారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వివరించారు.

# మోసానికి లోన్ కావద్దు

- రుణ యాప్‌లతో జర భద్రం
- హామీ లేని రుణాలంటూ వల
- ఎక్కువగా మోసపోతున్న యువత
- బాధితుల్లో అధిక శాతం విద్యావంతులే..
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు




కొత్తపల్లి: మేలెంచి కీడెంచాలని పెద్దలు చెప్పిన మాటలు ప్రస్తుతం నిజమనిపిస్తున్నాయి. సాంకేతిక విప్లవం కొన్ని సందర్భాల్లో గాడి తప్పుతోంది. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న మొబైల్ సాంకేతికత.. అనేక సందర్భాల్లో నిట్టనిలువునా ముంచుతున్నాయి. ప్రజల అవసరాలను, వారి బలహీనతలను ఆసరాగా తీసుకుని రుణ యాప్‌ల నిర్వాహకులు పేట్రేగిపోతున్నారు. మండలంలో అనేక మంది బాధితులు బయటకు చెప్పలేక మథనపడుతున్నారు. లోన్ యాప్ నిర్వాహకుల వలలో పడి.. రుణాలు తీసుకున్న అమాయక యువకులు బాకీ చెల్లించినా, వేధింపులు తాళలేక తనువు చాలిస్తున్న సంఘటనలు అక్కడక్కడా వెలుగుచూస్తున్నాయి.

**ఫోన్లలో మభ్యపెట్టి..**

మీరు రుణం తీసుకోవడానికి ఎంపికయ్యారు అంటూ ఫోన్లు చేసి యువతకు వల వేస్తున్నారు. చూద్దామని చెబితే చాలు.. రుణం తీసుకునేవరకూ ఫోన్ చేసి, ఏదో విధంగా ఒప్పించి రుణాన్ని తీసుకునేందుకు మభ్యపెడుతున్నారు. తీరా లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుంటే, వడ్డీపై వడ్డీ వేసి, రుణం సొమ్ము నుంచే ముందుగానే కొంత మినహాయించి ఇస్తున్నారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో పరిధిలో ఇలా 12 మంది బాధితుల సంఘటనలు వెలుగుచూశాయి. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో సుమారు వంద మంది బాధితులు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

**ఒక్క క్లిక్‌తో..**

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోన్ చేసుకోండి.. హామీ లేకుండా రుణం పొందండం టూ రుణ యాప్‌ల నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు మొబైల్ వినియోగదార్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎటువంటి హామీ లేదనడంతో సామాన్య ప్రజలు ఈ కల్లబొల్లి మాటలకు ఆకర్షితులవుతున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఒక్కసారి యాప్‌ల వలలో చిక్కితే.. బయటపడడం దాదాపు అసాధ్యంగా పరిణమిస్తోంది.

**తీవ్ర వేధింపులు**

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు తీవ్రతరమవుతున్నాయి. రుణ గ్రహీత మొబైల్ నంబర్లకు పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే పోస్టులతో, దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, అభ్యంతరకర ఫొటోలు పంపిస్తున్నారు. బెదిరింపులకు లెక్కచేయకపోతే రుణ గ్రహీత కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి, రుణం పొందిన వారి సెల్‌ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు, వాట్సాప్‌లకు పంపుతున్నారు. వీరి ఆగడాలను కొందరు బయటకు చెప్పుకోలేక నలిగిపోతున్నారు. మరి కొందరు బలవన్మరణానికి పాల్పడుతున్న సంఘటనలు కొన్నిచోట్ల వెలుగుచూశాయి. కొందరు యువకులు రుణం తీర్చడానికి కుటుంబ సభ్యులను మోసం చేయడం, చోరీలకు సైతం పాల్పడడం జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇలాంటి యాప్‌ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాలపై కన్నేశారు.

**ఓటీపీ అడిగి..**

కొత్తపల్లికి చెందిన ఒక ఉపాధ్యాయుడికి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి.. మీ పాన్ కార్డుకి ఫోన్ నంబర్ లింక్ చేస్తామని చెప్పారు. ఓటీపీలు చెప్పమన్నారు. రెండు సార్లు ఓటీపీలు చెప్పడంతో, ఆ ఉపాధ్యాయుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.95 వేలు మాయమయ్యాయి. అలాగే పాత ఇసుకపల్లికి చెందిన ఓ యువతికి జాబ్ ఇప్పిస్తామని చెప్పి, ఫోన్ ద్వారానే రూ.15 వేలు కాజేశారు. కొమరగిరికి చెందిన ఓ మహిళకు అపరిచితులు ఫోన్ చేసి, మీరు ఇంటి వద్ద ఉండి జాబ్ చేసుకోవచ్చంటూ రూ.15 లక్షలు దఫదఫాలుగా పెట్టుబడి పెట్టించి మోసగించారు. దీనిపై బాధితురాలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

**అప్రమత్తతే ప్రధానం**



స్మార్ట్ ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి. ప్రతి యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేశామో ఇబ్బందులను కొనితెచ్చుకున్నట్లే. రుణ యాప్‌ల్లో అప్పు తీసుకుని మోసపోవద్దు. రుణ యాప్‌ల జోలికి అసలే పోవద్దు. రుణ యాప్‌ల నిర్వాహకుల నుంచి వేధింపులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశ పడవద్దు. మాయమాటలు విని మోసపోవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

– వెంకటేష్, ఎస్సై, కొత్తపల్లి

### పంచారామ క్షేత్రంలో శివుడికి అభిషేకాలు



స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

సామర్లకోట: పవిత్ర పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తెచ్చిన పాలతోను, నీటితో స్వామివారికి అభిషేకాలు చేశారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారికి తొలి అభిషేకంలో మాత్రమే పాలతోను, అనంతరం నీటిలో అభిషేకం చేస్తారు. స్వామివారి తొలి అభిషేకాన్ని, తొలి పూజను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. మంగళవారం చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి రద్దీ తగ్గింది. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిదిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం దేవస్థానం నుంచి అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

# మేమేం పాపం చేశాం..!



ఆందోళన చేస్తున్న పట్టు రైతులు

- ఆర్థిక సాయం అందని పట్టు రైతుల ఆందోళన

పిఠాపురం: కొందరికి నష్ట పరిహారం ఇచ్చి, మరి కొందరికి ఇవ్వకపోవడంపై పట్టు రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. నకిలీ గుడ్లతో నష్టపోయిన రైతులు చేబ్రోలు పట్టు పరిశ్రమ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గత నెల 11న రామ్ నగర్ నుంచి 162 లాట్‌లో 20,000 వరకు గుడ్లను తెచ్చి 30 మంది రైతులకు అందించారు. ఇందులో 15 మంది రైతులు పిల్లదశలోనే గూళ్లు కట్టవని నిర్ధారించి కొన్ని తొలగించారు. మిగిలిన 15 మంది రైతులు వారి పంటను కొనసాగించారు. అయినప్పటికీ వాళ్లకు కూడా గూడులు తయారు కాలేదు. ఈలోపు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ ధర్నాలో పాల్గొన్న 86 మంది రైతులను అధికారులు గుర్తించారు. ఇంకా పంట కొనసాగించిన 15 మంది రైతులను పట్టించుకోకుండా వదిలేయడంతో వారు సోమవారం రాత్రి దీనిని అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఇప్పటికే నష్టపోయిన రైతులను గుర్తించామని, మిగిలిన రైతులకు ఏమీ చేయలేమని చెప్పారు. దీంతో మంగళవారం పట్టు పరిశ్రమల కేంద్రానికి వచ్చి అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి దృష్టికి సమస్యను తీసుకెళ్లడానికి రైతులు ప్రయత్నించారు. దానికి అధికారులు సహకరించకపోవడంతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేబ్రోలు పట్టు పరిశ్రమ పరిధిలో ఎంతమంది నకిలీ గుడ్లు కొన్నారు, ఎంత మంది నష్టపోయారనేది అధికారులు గుర్తించకుండా, కేవలం ఆందోళన చేసిన వారినే నష్టపోయిన రైతులుగా గుర్తించారని ఆరోపించారు. వివిధ కారణాల వల్ల తాము ఆందోళనకు రాకపోతే తాము నష్టపోయిన రైతుల్లో ఉండమా అంటూ అధికారులను ప్రశ్నించారు. అందరికీ నష్ట పరిహారం ఇవ్వడంలో అధికారులు డిప్యూటీ సీఎం, కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు పట్టు రైతులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న ఆకాశ దీపం



ధ్వజ స్తంభం వద్ద ఏర్పాటు చేసిన ఆకాశ దీపం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తికమాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు రాత్రి ఆకాశ దీపం వెలిగిస్తున్నారు. ఆలయంలోని ధ్వజ స్తంభం వద్ద ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, అల్లకి రాజ్‌గోపాల్, వినియ్ ఆకాశ దీపానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హరహర మహాదేవ శంభో శంకరా అంటూ ఆకాశ దీపాన్ని ధ్వజ స్తంభ శిఖరం వద్ద ఏర్పాటు చేయగా, భక్తులు ఆసక్తిగా తిలకించారు.

# ఫొటోలు తీసివ్వండి.. తాట తీస్తాం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణభగవాన్

- సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: ఆకతాయిలు వేధిస్తే వారి ఫొటోలు తీసి, మోటార్ సైకిళ్ల నంబర్లు నమోదు చేసి తమకు ఇవ్వాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ మహిళలకు, విద్యార్థినులకు సూచించారు. అలా చేస్తే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కీలకమైన మహిళా రక్షణ చట్టాలపై మహిళలు, విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. స్థానిక గాంధీచౌక్‌లోని సాయి ఐశ్వర్య మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో సీఐ అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల కాలంలో మహిళలు వేధింపులకు గురవుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఆకతాయిల బెడద పెరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వీటిపై మహిళలు, విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా పోలీసులు అందుబాటులో ఉండటంతో, విద్యార్థినులు తమ సమస్యలను వారికి తెలియజేయవచ్చన్నారు. కళాశాలలకు వెళ్లే సమయంలోను, అక్కడి నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఆకతాయిలు వేధిస్తే వారి మోటారు సైకిళ్ల నంబర్లను గమనించాలన్నారు. ప్రతి విద్యార్థిని వద్ద సెల్‌ఫోన్లు అందుబాటులో ఉండటంతో, ఆకతాయిల ఫొటోలను తీసి తమకు పంపాలన్నారు. ప్రతిఒక్కరి ఫోన్‌లోను హెల్ప్‌లైన్ నంబరు, దిశ యాప్‌ను నమోదు చేసుకుని, అపాయం అనుకున్నప్పుడు వాటిని యాక్టివేట్ చేసి.. తమను తాము కాపాడుకోవచ్చన్నారు. మహిళలను వేధించే వారిని కఠినంగా శిక్షించడానికి మహిళా రక్షణ చట్టాలున్నాయని, వాటిని విద్యార్థినులకు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కరణం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ లంకా ప్రసాద్, ఏఓ ఎం.అనిల్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మద్యం షాపును తొలగించాలి



మద్యం షాపు తొలగించాలని ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

కొత్తపల్లి: నివాస ప్రాంతంలో ఉన్న మద్యం షాపును వేరే చోటికి తరలించాలని మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ సభ్యుడు సూర్యనారాయణ కోరారు. మండలంలోని ఉప్పాడ పాత మార్కెట్ గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్ద స్థానిక మహిళలతో కలిసి మంగళవారం ఆందోళన నిర్వహించారు. నివాస ప్రాంతాలు, అంగన్‌వాడీ కేంద్రం ఉన్న ప్రదేశంలో, ప్రార్థన మందిరాలున్న ప్రాంతాల్లో ఎలా మద్యం షాపును ఏర్పాటు చేశారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో చిన్న పిల్లలు, విద్యార్థులు, మహిళలు తిరుగుతుంటారని, మద్యం షాపును ఏర్పాటు చేయడం వలన వారికి రక్షణ లేకుండా పోతుందన్నారు. ఈ మద్యం షాపును తొలగించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కర్నూల్ విశ్వనాథం, చొక్కా ఇస్సాక్, మల్లె మేసలమ్మ, సూరాడ బంగారమ్మ, గరికి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన ఆకట్టుకుంది. కార్తికమాసం సందర్భంగా ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. రూ.2,500 చెల్లించి, లక్షపత్రి పూజలు చేసిన వారికి జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. జ్యోతిర్లింగంలో దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడ్డారు.

### ప్రత్యేకాలంకరణలో భీమేశ్వరస్వామి



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలోని స్వామి వారిని, అమ్మవార్లను ఆలయ అర్చకులు మంగళవారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్తికమాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజు ప్రత్యేక పూజలు, సాయంత్రం అలంకరణలు చేస్తున్నారు. అమ్మవారికి బంగారు కిరీటంతో పాటు, ఆభరణాలను అలంకరించారు.

### పొలం బడిలో పాఠాలు



పొలంలో చదువుకుంటున్న విద్యార్థులు



పి.దొంతమూరులో పొలం బాట పడుతూ..

పిఠాపురం: అది పిఠాపురం మండలం పి దొంతమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల. పలకా, బలపం పట్టి తరగతి గదిలో పాఠాలు నేర్చుకునే వారంతా కాడి పట్టిన కర్షకుడి చెంతకు వెళ్లి పొలంలో పాఠాలు నేర్చుకుంటున్నారు. వారంతా చదువుకుంటున్నది ఐదు నుంచి పదో తరగతి వరకే. అయితే విద్యార్థి దశలో అతికీలకమైన హైస్కూలు విద్యలో వ్యవసాయ పాఠాలు నేర్పడం ద్వారా రాబోయే కాలంలో రైతు విలువను చాటిచెప్పడానికి ఉపాధ్యాయులు నడుం బిగించారు. దీంతో తరగతి నుంచి విద్యార్థులు పొలం బాట పట్టారు. వ్యవసాయంపై తరగతి గదుల్లో కంటే.. పకృతిలో పూర్తిగా తెలుస్తుందని విద్యార్థులను పొలం బాట పట్టించారు. క్షేత్ర స్థాయిలో జరిగే వ్యవసాయ పద్ధతులను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి భోదిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్కో రోజు వ్యవసాయ క్షేత్రాలకు తీసుకెళ్లి, పొలాల్లో విద్యాభోదన చేస్తున్నారు. నారు వేయడం నుంచి పంట చేతికొచ్చే వరకు రైతు చేస్తున్న వ్యవసాయం వారికి కళ్ల ముందు చూపిస్తున్నారు. చిన్ననాటి నుంచి విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించడం ద్వారా ఉన్నత చదువులకు దోహదం చేస్తుందని, వ్యవసాయానికి ఆదరణ తగ్గకుండా ఉంటుందని పాఠశాల ఉపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు.

## సినిమాలు



| | |
|---|---|
| **పెద్దాపురం** | |
| లలితా స్క్రీన్–1 | లక్కీ భాస్కర్ |
| లలితా స్క్రీన్–2 | క |
| వీరభద్ర | బఘీర |
| శోభా | అమరన్ |
| **సామర్లకోట** | |
| అనుశ్రీ స్క్రీన్–1 | క |
| అనుశ్రీ స్క్రీన్–2 | అమరన్ |
| విఘ్నేశ్వర | లక్కీ భాస్కర్ |
| **పిఠాపురం** | |
| వేంకటేశ్వర | క |
| సత్య | దేవర పార్ట్–1 |
| అన్నపూర్ణ | అమరన్ |
| పూర్ణ | లక్కీ భాస్కర్ |
| **ఉప్పాడ** | |
| శ్రీనివాస | లక్కీ భాస్కర్ |

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



తాటిపర్తిలో పుట్టకు భక్తుల పూజలు



కొత్తపల్లిలో నాగ దేవతకు పూజలు



గుడివాడలో పుట్ట వద్ద నాగేంద్రుడిని మొక్కుతున్న భక్తులు



సామర్లకోట టిడ్కో గృహాల వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: నాగుల చవితి సందర్భంగా భక్తులు పుట్టలకు పూజలు చేశారు. పుట్టల కోసం మంగళవారం తెల్లవారుజాము నుంచి భక్తులు వెతుకులాట ప్రారంభించారు. భక్తులతో పెద్దాపురం ఏడీబీ రోడ్డు, విస్తరణ శిక్షణ కేంద్రం, టీటీడీసీ, ఉండూరు ఫిల్టర్ ప్లాంటు, నాగార్జున ఫిల్టర్ చెరువు, సాంబమూర్తి రిజర్వాయర్, అయోధ్య రామపురం వాటర్ ట్యాంకులు, వ్యవసాయ పరిశోధన కేంద్రం, టిడ్కో ఇళ్ల సముదాయం, ఉండూరు రోడ్డు, పంచారామ క్షేత్రం రోడ్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ప్రదేశాల్లో ఉన్న పుట్టలకు పూజలు చేశారు. పుట్టలో ఆవుపాలు, కోడిగుడ్లు, చిమ్మిడి, చలివిడి, బుర్రగుంజు, నూకలు వేసి, పూలతో పూజలు చేశారు. పుట్టల వద్ద బాణసంచా కాల్చారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా అచ్చంపేట శివారు కొప్పవరం గ్రామంలోని పొలాల్లో పుట్టకు పూజలు చేశారు. రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, రాజేశ్వరి దంపతులు, కౌన్సిలర్లు, సర్పంచ్, ఎంపీటీసీల కుటుంబ సభ్యులు నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.

పెద్దాపురం: నాగుల చవితి వేడుకలను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే పొలాలకు వెళ్లి పుట్టల్లో ఆవుపాలు పోసి, నాగ దేవతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల పుట్టల వద్దే కార్తిక వన సమారాధనలు చేసుకున్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆవు పాలతో స్వామికి అభిషేకాలు జరిపారు.

కొత్తపల్లి: మండలంలో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పొలాల్లోని పుట్టల వద్దకు చేరుకుని, పూలతో అలంకరించారు. ముగ్గులు వేశారు. అనంతరం పాలు, గుడ్లు, చలివిడి, సిమ్మిడి కొలువల్లో వేసి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానికకంగా ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, బాలాత్రిపుర సుందరి రాజశేఖరస్వామి, ధర్మశాస్తా, ఉప్పాడలో చాడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి గోర్సలో పురాతన రామాలయం, ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

పిఠాపురం: నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు రైతులు తమ పొలాల్లో ఉన్న పుట్టల్లో పాలు పోసి, ఉత్సాహంగా వేడుకలు జరిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి ఆలయ ఆవరణలో ఉన్న పుట్టల్లో పూజలు నిర్వహించిన ఆలయ అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి భక్తులతో పుట్టల్లో పాలు పోయించారు.

### 104 సిబ్బంది ఆందోళన




వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

పిఠాపురం: తమ డిమాండ్లను పరిష్కరించాలని గొల్లప్రోలు 104 సిబ్బంది మంగళవారం ఆందోళన నిర్వహించారు. గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ సుబ్బారావు, చేబ్రోలు వైద్యాధికారి ఆర్‌వీ జగదీష్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా నిర్వహించి, ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. అలాగే 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని కోరారు. యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లు చేశారు.